క్లుప్తంగా

పొలంబడి క్షేత్ర ప్రదర్శన

రాజుపాలెం: అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత వాతావరణం ఉన్నప్పుడు వరిలో సుడిదోమ ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనరసయ్య తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెంలో పొలంబడి క్షేత్ర ప్రదర్శన సోమవారం నిర్వహించారు. క్షేత్ర ప్రదర్శన్‌లో వ్యవసాయాధికారి వరి పంటపొలాలను పరిశీలించి సుడిదోమ ఉన్నట్లు గమనించారు. సుడిదోమ గోధుమ రంగులలో ఉండి దుబ్బు అడుగున ఆశించి రసం పీల్చడం వలన పైరు ఎండిపోతుందని తెలిపారు. దీని నివారణకు ఎకరానికి బుప్రోఫిజిన్ 400 మిల్లీలీటర్లు 120 గ్రాముల పైమెట్రోజైన్. లేదా ఎసిఫేట్ 350 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సహాయకురాలు ఆర్.సుచరిత, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

రాజుపాలెం: రీ సర్వేకు రైతులందరు సకాలంలో సహకరించాలని తహసీల్దార్ ఉన్నీస్సా బేగం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రీ సర్వేపై రాజుపాలెం, బ్రాహ్మణపల్లి రైతులకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే వలన రైతుల పొలం సమస్యలు తీరిపోతాయని తెలిపారు. సర్పంచ్ పులిబండ్ల అశోక్ మాట్లాడుతూ సర్వే అధికారులు రైతుల వద్దనున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఎగ్రిమెంట్ చేసుకున్న రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. బ్రాహ్మణపల్లి సర్పంచ్ ఓర్సు వెంకటపతి, డిప్యూటీ తహసీల్దార్ నళిని, సర్వే అధికారులు పాల్గొన్నారు.

నేడు కట్టమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి: పట్టణంలో పేరుకుపోయిన పారిశుధ్యం, మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అధికంగా వస్తున్న విద్యుత్తు బిల్లులను వెంటనే సవరించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' పాదయాత్ర సోమవారం నాలుగో రోజు పట్టణంలోని మాస్ట్రిన్ పేట, సుగాలి కాలనీ, రంగా కాలనీ, సొసైటీ ఏరియా, అంబేడ్కర్ నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో సీపీఎం పల్నాడు జిల్లా నాయకులు గుంటూరు మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, కట్టా శివదుర్గారావు, డి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పోరుయాత్ర

సత్తెనపల్లి: సాగునీటి విధానంపై ప్రభుత్వం తన వైఖరి ఏమిటో చెప్పాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం సత్తెనపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్ర మండలంలోని లక్కరాజు గార్లపాడు గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వంగర తులసీరామ్, రావూరి పూర్ణచంద్రరావు, శివయ్య పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ శిబిరం



పిడుగురాళ్ల: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ప్రాంగణంలో జరుగుతున్న ఎన్‌సీసీ–8 (వార్షిక శిబిరం) ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శిబిరంలో మూడవ రోజైన సోమవారం క్యాడెట్‌లకు కవాతు, పీఎం ర్యాలీ, గార్డ్ ఆఫ్ ఆనర్, టెంట్ నిర్మాణం, వ్యాయామం, యోగా అంశాలలో తర్ఫీదు ఇచ్చారు. చిరు ధాన్యాల ఆవశ్యకతపై లెఫ్ట్‌నెంట్ జె.వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్ పోస్టర్ ప్రజెంటేషన్‌తో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణలో భాగంగా సాంస్కృతిక అంశాలలో తర్ఫీదు కల్పించటం జరిగిందని తెలిపారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్దూ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరాన్ని ఎస్ఎం విజయక్ష మోహితీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వోలు జి.నారాయణమూర్తి, ఎ.పావని, సూపరింటెండెంట్ యశోద, అనిల్‌కుమార్, ట్రైనింగ్ జేసీవో గురుమూర్తి, ఆర్మీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు
- రెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పరిశీలన



రెడ్డిగూడెం వైద్య శిబిరంలో రక్త పరీక్ష చేయించుకుంటున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: ప్రజల సమగ్ర ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. రాష్ట్రమంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డితో కలసి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా ప్రతీ ఇంటికి వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు నేరుగా వచ్చి రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వారికి ఏ రకాల జబ్బులు ఉన్నాయో తెలుసుకుని వెంటనే వారికి చికిత్సలను ప్రారంభించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారితో వైద్య సేవల గురించి ఆరాతీశారు. డాక్టర్లకు వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. నిపుణులైన వైద్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రాథమిక వైద్యాధికారులు కేవీ కృష్ణకుమార్, డాక్టర్ కిషోర్‌లు 447 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 376 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 25 మంది గర్భిణులను పరీక్ష చేశారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ జరీనా తాజ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌కె బాషా, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎస్‌కే జానీ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కండ్లకుంటలో...

నకరికల్లు: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో ఎందరో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు, మందులు అందుతున్నాయని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. పలురకాల అనారోగ్య సమస్యలతో వచ్చిన సుమారు 450 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు వి.శ్రీనునాయక్, పూజారెడ్డి, స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ పువ్వాడ సాయిలక్ష్మి, డాక్టర్ బాలకృష్ణల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ రావెళ్ల సాయి నవీన్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బక్కా మేరీ, ఉపసర్పంచ్ కంఠమనేని చందు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కంఠమనేని కోటయ్య, చట్టి అప్పయ్య, గాలి చంద్రయ్య పాల్గొన్నారు.

ఉంగుటూరులో...

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం నాణ్యమై వైద్యసేవలను ఉచితంగా అందించటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ వైద్యాధికారులు టి.సౌమ్య, మౌనిక, రఘువీర్‌లు 516 మంది రోగులను పరీక్షించి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశామ న్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, రాయపాటిశివతో పాటుగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రుద్రవరంలో...

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేసి, ఆ మేరకు అవసరమైన మందులను అందిస్తుండటంతో చిన్నపాటి అనారోగ్య సమస్యలున్నవారు సైతం వైద్య పరీక్షలు చేయించుకునేందుకు శిబిరానికి తరలివచ్చారు. మొత్తం 510 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి తెలిపారు. 170 మందికి కంటిపరీక్షలు, 18 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జగనన్న సురక్ష కిట్టులను పంపిణీ చేశారు. సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కండ్లకుంట జగనన్న సురక్ష కార్యక్రమంలో ఓపీ నమోదు చేయించుకుంటున్న గ్రామస్తులు



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యం చేరువవుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 27, 29 వార్డుల ప్రజల సౌకర్యార్థం పీర్ల చావిడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంబశివరావు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష సువర్ణ అవకాశమన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 610 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 75 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

హసనాబాద్(క్రోసూరు): ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష అతి పెద్ద భరోసా అని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌క్యాంపు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యపరీక్షలు గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగిని పలకరించారు. హెల్త్ క్యాంపులో పాల్గొన్న స్పెషలిస్టు వైద్యులు ఆర్థో డాక్టర్ ఇంద్రప్రసాద్, జనరల్ సర్జన్ డాక్టర్ మహ్మదీ సైదయ్యను ఎమ్మెల్యే పలకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశిబిరాల్లో 66 రకాల వైద్యపరీక్షలు 105 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పేద వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందచేశారు. 303 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందచేశారు. శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మ బాయి, డాక్టర్ సిరిచందన, డాక్టర్ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఏఎన్ఎంలు, సూపర్‌వైజరులు, గ్రామ సర్పంచ్ రహీమాన్, షేక్ ముస్తఫా, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి..

హసనాబాద్ సర్పంచ్ గాకేశనబోయిన చిన వీరయ్య ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచ్ కృషి చేయాలని, అందుకు తన పూర్తి సహాయసహకారాలు ఉంటాయన్నారు. పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'గుబ్బా' పై అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదు




మాట్లాడుతున్న చల్లంచర్ల సాంబశివరావు, పక్కన ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య సంఘాల రాష్ట్ర నాయకుడు, ఏపీ ఎన్విరాన్‌మెంట్ బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్‌పై అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదని సత్తెనపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. గుబ్బా చంద్రశేఖర్ పై జయంతి వెంకటేశ్వర్లు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆటపా నాయకులు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ వ్యక్తిగత దూషణలు సమంజసం కాదని, పల్నాడు ఏరియాలో గుబ్బా చంద్రశేఖర్ పేరు తెలియని ఆర్యవైశ్యులు ఉండరన్నారు. అలాంటి వ్యక్తిని దుర్భాషలాడటం సరైన విధానం కాదని, తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. అలా కాదని మాట్లాడితే పల్నాడు జిల్లాలో తిరగనియ్యమని స్పష్టం చేశారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ గుబ్బా చంద్రశేఖర్ లాంటి మంచి వ్యక్తిని అమానుషంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. అందులోనూ వ్యక్తిగత దూషణలు సమంజసం కాదని ఖండించారు. ఆర్యవైశ్య గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మీ శివన్నారాయణ మాట్లాడుతూ పల్నాడు జిల్లా మొత్తం ఏకతాటి మీద ఉందని, గుబ్బా చంద్రశేఖర్‌కి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అలాంటి వ్యక్తి పై అనుచిత వ్యాఖ్యలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్యలు మాట్లాడుతూ తక్షణమే జయంతి వెంకటేశ్వర్లు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్యవైశ్య ఆటపా అధ్యక్షుడు మోటమర్రి చందు, ఆర్యవైశ్య సంఘ నాయకులు కాపుగంటి రత్తయ్య, చిలకల వాసు, కొత్తూరు విశ్వేశ్వరరావు, నోముల రమణ, దేవరపల్లి కాశీ విశ్వనాథం, స్వామి ప్రసాద్, కాకర్ల రమేష్, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



కౌమారీదేవి అలంకారంలో చేజర్లలోని అమ్మవారు



అచ్చంపేటలో బాలాత్రిపుర సుందరి దేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



బెల్లంకొండలో బ్రహ్మచారిణిగా అమ్మవారు



అన్నపూర్ణదేవిగా క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరి..



75 త్యాళ్ళూరులో గాయత్రి దేవిగా అమ్మవారు



సత్తెనపల్లిలో గాయత్రిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి..



పెద్దమక్కెనలో అన్నపూర్ణాదేవి అలంకారం

కౌమారీదేవి అలంకారంలో...

నకరికల్లు: దేవీశరన్నవరాత్రి వేడుకలు మండలంలో సోమవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. చేజర్లలోని కపోతేశ్వరస్వామి దేవాలయంలో గంగా పార్వతీ ని, నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారిని కౌమారీ దేవి రూపంలో అలంకరించారు. ప్రముఖ ఆలయాల్లో కౌమారీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత బాలాత్రిపుర సుందరిగా సోమవారం రెండవరోజు భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు సూరే సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామ పారాయణం జరిగింది. సీతారామస్వామివారి దేవాలయంలో ఆధ్వర్యంలో సీతామహాలక్ష్మీ అమ్మవారు భక్తులకు గజలక్ష్మిగా దర్శనభాగ్యం కలిగించారు.

బ్రహ్మచారిణి అవతారంలో..

బెల్లంకొండ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని మహాలక్ష్మీ పీఠంలో సోమవారం అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి రెండవ రూపం బ్రహ్మచారిణి అవతారమని శతాధిక ప్రతిష్టాచార్య పులుపుల వేంకట ఫణి కుమారశర్మ తెలిపారు. నాగిరెడ్డిపాలెంలో దుర్గామాత ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అన్నపూర్ణదేవీగా...

క్రోసూరు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు సోమవారం భక్తులకు అన్నపూర్ణదేవిగా దర్శనభాగ్యం కలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో భక్తులు దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు ఘనంగా చేశారు. సాయంత్రం ఆర్యవైశ్య మహిళా భక్తులతో బతుకమ్మ ఉత్సవం, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు చుండూరు మల్లికార్జునరావు, గౌరవ అధ్యక్షుడు కోట ప్రభాకరరావు పర్యవేక్షించారు.

గాయత్రీదేవి అలంకారంలో...

ముప్పాళ్ళ: మండలంలోని పలు శివాలయాల్లో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలోని శ్రీజగన్నాథస్వామి వారి ఆలయంలోను, నార్నెపాడులోని శ్రీశంభులింగేశ్వర స్వామి ఆలయం, లంకెలకూరపాడులోని శ్రీగంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయం, మాదలలోని శ్రీసంగమేశ్వరస్వామి ఆలయాల్లోను దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గాయత్రీ దేవిగా...

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెదకూరపాడులోని నాగమల్లేశ్వరస్వామి దేవాలయంలో గాయత్రి దేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండోరోజు సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పట్టణం లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, సనారి వీరబ్రహ్మేంద్రశ్రమంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారిని అర్ధనారీశ్వరుడిగా, వెంకటపతి కాలనీలోని నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠం నందు అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద, వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. పెద్దమక్కెనలో గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాల యంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సహకార రంగం మరింత బలోపేతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆటో డ్రైవర్లు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: టీడీపీ హయాంలో నిర్వీర్యమైన వ్యవసాయ సహకార పరపతి సంఘాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆర్థికంగా పరిపుష్టమై అన్ని రంగాలలో బలోపేతమయ్యాయని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నరుకుళ్లపాడులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో లేమల్లె గ్రామంలో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరుకుళ్లపాడు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు సేవలు అభినందనీ యమన్నారు. రైతులందరికి మేలు జరిగే విధంగా సీఎం జగనన్న పాలన సాగుతోందన్నారు. రైతుల మేలు కోసం రైతు భరోసా కేంద్రాలు నిర్మించడంతో పాటు తెలుగుదేశం హయాంలో పతనావస్థకు చేరువైన సొసైటీలను నేడు పతాక స్థాయికి తీసుకొచ్చారన్నారు. టీడీపీ హయాంలో సొసైటీల ద్వారా రూ.లక్ష రుణం కూడా ఇవ్వలేని దుస్థితి ఉండేదన్నారు. కానీ నేడు జగనన్న పాలనలో రూ.40 లక్షల వరకు రుణాలు అందుతున్నాయన్నారు. గతంలో 2019 నాటికి రూ.6 కోట్ల టర్నోవర్ ఉండే నరుకుళ్లపాడు సొసైటీ నేడు రూ.70 కోట్ల టర్నోవర్ చేస్తుండడం అభివృద్ధికి తార్కాణమన్నారు. నరుకుళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం రూ.10 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంతో పాటు రైతుల కోసం ప్రతి మండల కేంద్రంలో సహకార సంఘ బ్యాంకుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే అచ్చంపేట, క్రోసూరు మండలాల్లో బ్యాంకులు ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హమ్మీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన..

అమరావతి – బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణపనులను సోమవారం మండల పరిధిలోని మునగోడు వద్ద ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించి పనులు మరింత వేగంగా జరగాలని సూచించారు.

అన్నివర్గాలకు అండగా జగనన్న పాలన

పెదకూరపాడు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అనే తేడా లేకుండా అన్నివర్గాలకు మంచి చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు మండలంలోని పాటిబండ్లలో వాహనమిత్ర లబ్ధిదారుల ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాటిబండ్ల, ముస్సాపురం, పాడపాడు, లింగంగుంట్ల ఆటో యూనియన్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నంబూరు మాట్లాడుతూ మంచి చేస్తున్నందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా నీరాజనాలు పడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వాగ్దానాలు మాత్రమే చేసిందని, కానీ జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పాదయాత్రలో ఆటో డ్రైవర్లకు కష్టాలు తెలుసుకొని వాహనమిత్ర పథకం తెచ్చారన్నారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, స్థానిక నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సుపరిపాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అంబటి రాంబాబు



కట్టమూరులో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సుపరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. గత నాలుగేళ్లుగా అందిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు సాహసించని రీతిలో సంక్షేమ, పరిపాలన సంస్కరణలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర రెడ్డి, సర్పంచ్ దార్ల సంధ్య, ఎంపీటీసీ గోపయ్య, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, పృథ్వీరాజ్, తెల్లూరి రోశయ్య, మాగంటి నరసింహారావు, దావీదు, మర్రి సుబ్బారెడ్డి, అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్, పలు శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.